


మహిళల భద్రతకు ప్రాధాన్యత

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, రక్షణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో పోలీసు అధికారులను ఆదేశించారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో భాగంగా పోలీసు స్టేషన్లను ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో సిబ్బంది మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని ఆదేశించారు. విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది సందర్శించి, వారికి రక్షణగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందే విధానంపట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ తరుపున చర్యలు చేపడుతున్నామని వివరించారు.

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ జిల్లాలో చికెన్ విక్రయాలపై భారీగానే పడింది. జిల్లాలో ఆదివారం కోళ్ల విక్రయాలు పది శాతం కూడా కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూతో కోళ్లు మరణిస్తుండటం, అది సోకిన కోళ్లను తిన్నవారికీ వ్యాపిస్తుందనే ప్రచారంతో చికెన్ విక్రయాలు దారుణంగా మందగించాయి. ఆదివారమైతే ముక్కలేనిదే ముద్ద దిగని వారు సైతం చికెన్‌ను పక్కన పెట్టిన పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా చేపలు, మటన్ వ్యాపారులు ధరలు పెంచేశారు.




చికెన్ ప్రియులను వెంటాడిన
బర్డ్‌ఫ్లూ భయం

- భారీగా పడిపోయిన కోళ్ల అమ్మకాలు
- ఆవేదన చెందుతున్న పౌల్ట్రీ, చికెన్ వ్యాపారులు
- పెరిగిన చేపలు, మటన్ విక్రయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో బర్డ్ ఫ్లూ భయంతో ఆదివారం చికెన్ అమ్మకాలు అమాంతంగా పడిపోయాయి. ఉభయగోదావరి జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి, కోళ్లు చనిపోవడంతోపాటు చికెన్ తిన్నవారికి కూడా బర్డ్ ఫ్లూ సోకుతుందని ప్రచారం జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో చికెన్ షాపులు ఆదివారం వెలవెలబోయాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే లక్ష నుంచి లక్షా 20 వేల కిలోల వరకు చికెన్ విక్రయాలు జరుగుతుంటాయి. మిగిలిన రోజుల్లో రోజుకు 40 వేల కిలోల వరకు చికెన్ విక్రయిస్తుంటారు. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో ఆదివారం 8 వేల కిలోల వరకు మాత్రమే అమ్మకాలు జరగ్గా, మిగిలిన రోజుల్లో పూర్తిగా విక్రయాలు లేవని పౌల్ట్రీ, చికెన్ వ్యాపారులు చెబుతున్నారు. ధర తగ్గించి విక్రయించినా చికెన్ ప్రియులు కొనుగోలుకు ముందుకు రాలేదు.



కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న చికెన్ దుకాణం

బొబ్బిలిలో బోసిపోయిన కోళ్ల ఫారాలు

బొబ్బిలి పట్టణంలో ఆదివారం కోళ్లఫారాలు, చికెన్ షాపులు బోసిపోయాయి. పట్టణంలో సుమారు 30 వరకు కోళ్ల ఫారాలు పెట్టుకుని నిరుద్యోగ యువకులు ఉపాధి పొందుతున్నారు. పట్టణంలో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌కు ముందు ఆదివారం ఒక్కరోజే 5వేల కిలోల చికెన్ అమ్మకాలు జరిగేవి. సాధారణ రోజుల్లో 2 వేల కిలోల వరకు అమ్మకాలు సాగేవి. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో పట్టణంలో ఆదివారం 500 కిలోల కూడా అమ్మకాలు జరగలేదని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ అమ్మకాలు పడిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోళ్ల ఫారాలలో పని చేసే కార్మికులకు కూలి డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పెంపకందారులంతా నిరుద్యోగులు, సాధారణ రైతులే

జిల్లాలో పౌల్ట్రీ పెంపకందారులంతా నిరుద్యోగులు, సాధారణ రైతులే. చదువుకుని ఉద్యోగాలు లేకపోవడంతో చాలామంది యువత బ్యాంకుల్లో రుణాలు, ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి బ్రాయిలర్ కోళ్ల పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో కోళ్ల అమ్మకాలు తగ్గిపోవడంతో పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పెంపకందారులను ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

పెరిగిన మటన్ ధర

బర్డ్ ఫ్లూ భయంతో జిల్లాలో చికెన్ విక్రయాలు పడిపోయాయి. మాంసం ప్రియుల దృష్టి మటన్, చేపలు, రొయ్యల వైపు మళ్లింది. ఇదే అదునుగా మటన్, చేపల వ్యాపారులు వాటి ధరలను అమాంతంగా పెంచేశారు. రూ.800 వరకు ఉండే కిలో మటన్ ధర.. ఆదివారం రూ.వెయ్యికి పెంచారు. కిలో రూ.120 నుంచి 150 వరకు ఉండే చేపల ధరలు.. రూ.200 వరకు చేరాయి.

కూలీలకు డబ్బులివ్వలేకపోతున్నాం



చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. మన జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేకపోయినా, అధిక ప్రచారంతో జనం కొనుగోలుకు ముందుకురావడం లేదు. దీంతో కోళ్లఫారం వ్యాపారం తీవ్రంగా దెబ్బతింది. అమ్మకాలు తగ్గిపోవడంతో కోళ్ల ఫారంలో పని చేసే వారికి కూలి డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

– మురహరి రాధాకృష్ణ, కోళ్లఫాం వ్యాపారి



ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

అవకాశమిస్తే అండగా ఉంటా..

పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించి వారికి అండగా ఉంటానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం నగరం, ఆమదాలవలసలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు. తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్, జెఎసి నాయకులు

ఆప్కోస్‌ను కొనసాగించాల్సిందే

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్ • మార్చి 10న కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి కార్పొరేషన్ ఆఫ్ అవుట్‌సోర్సెడ్ సర్వీసెస్ (ఆప్కోస్)ను కొనసాగించాల్సిందేనని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్‌చేశారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎస్.అప్పలరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం మేరకు ప్రభుత్వం ఆప్కోస్‌ను రద్దు చేసే యోచనలో ఉందని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తు అవుట్ సోర్సింగ్ నియామకాలు ప్రయివేటు ఏజెన్సీల ద్వారా చేపట్టాలనే ఆలోచనను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వమే నేరుగా నియామకాలు చేపట్టాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి దశలవారీగా వారిని రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటివరకు అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ కొనసాగించాలని డిమాండ్‌చేశారు.


ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి వాగ్దానం చేసినా, 8 నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలూ కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ సేవల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, కనీస స్థాయిలోనైనా సంక్షేమ పథకాలు అందకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించేలా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్లపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మార్చి పదో తేదిన కలెక్టరేట్ వద్ద ధర్నాకు రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది.

ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డి.సాయిప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, జెఎసి నాయకులు డి.జగన్మోహన్, కె.శ్రీనివాస్, ఎ.రాజేష్, రాజేష్, ఈశ్వరరావు, పి.దుర్గారావు, బి.శ్రీనివాసరావు, వి.రమేష్, మజ్జి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రాక

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

నగరంలో ఒక కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి.. జిల్లాకు వచ్చారు. స్థానిక జిల్లా పరిషత్తు అతిథి గృహానికి విచ్చేసిన ఆయనకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సాదర స్వాగతం పలికారు. జిల్లా కోర్టుకు చెందిన పలువురు న్యాయాధికారులు కూడా న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి.. జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర న్యాయాధికారులతో కొద్దిసేపు ముచ్చటించారు.



హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

విలేకరిపై దాడికి జర్నలిస్టు సంఘాల ఖండన

టిడిపి మక్కువ మండల అధ్యక్షుడిని అరెస్టు చేయాలంటూ నేడు ఉమ్మడి జిల్లాల్లో ఆందోళనలు

ప్రజాశక్తి – పార్వతీపురం

మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టిడిపి నాయకుల దాడిని పలు జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన మక్కువ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీనాయుడు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి పిఎస్‌ఎస్‌వి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు అల్లు సూరిబాబు, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అవనాపు సత్యనారాయణ, తెలుగు జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు ఎంఎంఎల్ నాయుడు, విజయనగరం జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడమంటే భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని, ఇటువంటి చర్యలను తాము సహించబోమని తెలిపారు. రామారావుకు, ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని, బెదిరింపు చర్యలకు పాల్పడిన వేణుగోపాలనాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కూడా రామారావుకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. విలేకరికిపై దాడి చేసిన మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాల నాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టరేట్ల వద్ద సోమవారం ఆందోళనలు తలపెట్టినట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో విలేకరులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టును చంపుతాననడం దుర్మార్గం

కొల్లి గంగు నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం

ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుని టిడిపి మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు చంపుతానని బెదిరించి దాడి చేయడం దుర్మార్గం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మన్యం జిల్లాలో ఇంతవరకు ఇలాంటి సాంప్రదాయం కనిపించలేదు. గతంలో ఈ ప్రాంతం నుంచి హేమాహేమీలైన నాయకులు మంత్రులుగా పని చేశారు. ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు చూడలేదు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అండ చూసుకుని ఆమె ప్రధాన అనుచరుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు విలేఖరి రామారావుపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

విలేకరి పై దాడి అమానుషం

మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు : విలేకరి మల్యాడ రామారావు పై టిడిపి నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పరిగణించే మీడియా సంస్థల ప్రతినిధులపై దాడి చేయడం అమానుషమం. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. పత్రికా విలేకరులు అనేక కోణాల్లో వారికి తెలిసిన విషయాలను వార్తలు గా రాస్తారు. వాటిలో ఎవరికైనా నొప్పించే విషయం వుంటే తగిన రీతిలో ప్రశ్నించాలి, లేదా ఫిర్యాదు చేయాలి. కానీ భౌతిక దాడికి పాల్పడడం దారుణమైన చర్య. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టు కుటుంబానికి రక్షణ కల్పించాలి.

సీతం, ఐబిఎస్‌సి మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇండియన్ బయోమెడికల్ స్కిల్ కన్సార్టియం మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. విశాఖపట్నంలోని పారిశ్రామిక వాడలో ఉన్న ప్రముఖ ఎఎంటి జెడ్‌లో కలాం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఇక్కడ ఉండే అనేక బయోమెడికల్ పరికరాల తయారీ, పరీక్ష, కాలిబ్రేషన్‌లో ప్రత్యేక నైపుణ్యంపై ఐబిఎస్‌సి ఒప్పందంతో విద్యార్థులకు ఉచిత ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య సర్టిఫికెట్ కోర్సులు, పరిశ్రమ సందర్శన అవకాశాలు లభించనున్నాయి. అదనంగా అధ్యాపకులు, విద్యార్థులకు పరిశోధన అవకాశాలు కూడా లభిస్తాయి. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల ప్రతినిధులు వి.జి. ప్రసూన (డీన్ – ఆర్‌అండ్‌డి), జి.వేణు మాధవ రావు (సిఎస్‌ఇ విభాగాధిపతి), సిహెచ్.వెంకట లక్ష్మి (మెకానికల్ విభాగాధిపతి) పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సీతం, ఐబిఎస్‌సి ప్రతినిధులు

పారా క్రీడలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 17 నుంచి 20 వరకు చెన్నైలో జరిగే 23వ పారా జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలకు ఆదివారం జిల్లా క్రీడాకారులు బయల్దేరి వెళ్లారు. వీరికి పారా జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో సత్తా చాటి, జిల్లా ప్రతిష్టను మరింతగా పెంచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 2న మంగళగిరిలో జరిగిన పారా రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన సుంకరి దినేష్, దొగ్గా దేముడు నాయుడు, బోధల వాసంతి, కిల్లాక లలిత.. పరుగు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్ పుట్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే.



జాతీయ పోటీలకు పయనమైన క్రీడాకారులు

ఫైలేరియా నివారణకు విస్తృత చర్యలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఫైలేరియా నివారణకు విస్తృత చర్యలు చేపడుతున్నామని ఫైలేరియా నివారణ జిల్లా అధికారి జి.వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఈ నెల పదో తేది నుంచి మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ రాష్ట్రంలో, దేశంలో సమాచారాన్ని బట్టి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎక్కువ కేసులు ఉన్నట్టుగా అర్థం చేసుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం బలిజిపేట, గుర్ల మండలాల్లో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఫైలేరియా నివారణ అధికారి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- ఐదు పిహెచ్‌సిల పరిధిలోని 95 గ్రామాల్లో మాత్రలు పంపిణీ
- పకడ్బందీగా మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం
- 'ప్రజాశక్తి'తో ఫైలేరియా నివారణ అధికారి వరప్రసాద్‌రెడ్డి ముఖాముఖి



? ప్రస్తుతం ఫైలేరియా కేసులు ఎన్ని? ఎక్కువగా ఎక్కడ ఉన్నాయి.?

పార్వతీపురం మన్యం జిల్లాలో 333, విజయనగరం జిల్లాలో 82 చొప్పున ఫైలేరియా కేసులు ఉన్నాయి. వీటిలో మన్యం జిల్లాలోని బలిజిపేట మండలంలోనే అత్యధికంగా 307 వరకు ఉన్నాయి. బలిజిపేట మండలం పెదపెంకిలో అత్యధికంగా 192 మంది బోధవ్యాధితో బాధపడుతున్నారు. ఇదే మండలం నారాయణపురంలో 20 మంది, బలిజిపేటలో 11 మంది, చిలకలపల్లిలో 15, అరసాడ పిహెచ్‌సి పరిధిలో 35 మంది, గళావల్లి పిహెచ్‌సి పరిధిలో 30 మంది ఫైలేరియాతో చికిత్స పొందుతున్నారు.

? విజయనగరం జిల్లాలో పరిస్థితి ఏమిటి.?

గుర్ల మండలాల్లో 82 ఫైలేరియా కేసులు ఉన్నాయి. ఒక్క గూడెం గ్రామంలోనే 58 వరకు ఉన్నాయి. ఆ గ్రామంలో ఈ ఏడాది కొత్తగా ఐదు కేసులు నమోదయ్యాయి. మొత్తంగా పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో గుర్ల, మన్యం జిల్లా బలిజిపేట మండలంలోనే కేసులు ఉన్నాయి.



? ఫైలేరియా నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఫైలేరియా బాధితులు ఉన్న గ్రామాలతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాలపై సైతం దృష్టి కేంద్రీకరించి, మందులు పంపిణీ చేస్తున్నాం. రాత్రి పూట రక్తనమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారించడం, పాజిటివ్ కేసులకు జాప్యం లేకుండా మందుల పంపిణీ చేయడం వంటి చర్యలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది.

? మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం అంటే ఏమిటి.?

ఫైలేరియా కేసులు పెరుగుతున్న చోట కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం చేపడుతున్నాం. దేశంలో 111 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. మన రాష్ట్రంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో మాత్రమే అమలవుతోంది. ఇక్కడ కేసులు అదుపులోకి రాకపోవడమే ఇందుకు కారణం. ఈ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నాం.

? జిల్లా అంతటా పంపిణీ చేస్తున్నారా.?

లేదు... లేదు... ఫైలేరియా కేసులు నమోదైన గ్రామాలతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో మాత్రమే ఈ మాస్ డ్రగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. ముందుగా చెప్పినట్టు బలిజిపేట మండలం బలిజిపేట, అరసాడ, గళావల్లి, గుర్ల మండలం మండలం గుర్ల, తెట్టంగి పిహెచ్‌సిల పరిధిలోని 95 గ్రామాల్లో రెండేళ్లలోపు గలవారు, గర్భిణులు మినహాయించి మిగిలిన వారందరికీ అక్కడికక్కడే మాత్రలు పంపిణీ చేస్తున్నాం. ఇందులో భాగంగా కొత్త కేసులను గుర్తించేందుకు కూడా ప్రయత్నిస్తున్నాం.

? మందుల పంపిణీ ఎంత వరకు వచ్చింది.?

మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు గ్రామ సచివాలయాలు లేదా ముఖ్యకూడళ్ల వద్దకు వచ్చిన వారికి అక్కడికక్కడే మాత్రలు మింగించే పనిచేశాం. 13నుంచి 22 వరకు 10 రోజులపాటు ఇంటింటికీ వెళ్లి మిగిలిన వారందరితో మాత్రలు మింగించే కార్యక్రమం జరుగుతోంది. అప్పటికీ తప్పిపోయిన వారిని గుర్తించి 23 నుంచి మాత్రలు వేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

జామికి స్థలం కరువు

- మొన్న కెజిబివికి..నేడు మోడల్ స్కూల్‌కి..
- డంపింగ్ యార్డుకూ చోటు లేక నదిలోనే వ్యర్థాలు
- శ్మశాన వాటిక లేని దౌర్భాగ్య పరిస్థితి
- అభివృద్ధికి ఆమడ దూరంలో మండల కేంద్రం

ప్రజాశక్తి - జామి

'అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లుంది జామి మండల కేంద్రంలోని అభివృద్ధి పరిస్థితి. మండలానికి సగభాగానికి జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహించగా, సగభాగానికి మూడు సార్లు గెలిచిన సినియర్ శాసన సభ్యులు కోళ్ల లలితకుమారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ జామి గ్రామానికి ఏ ఒక్క అభివృద్ధి పనీ దరిచేరడం లేదని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మండలానికి మోడల్ స్కూల్ మంజూరైనా, నిర్మించడానికి స్థలం లేదని అధికారులు, రాజకీయ నాయకలు చేతులు దులుపుకుంటున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మోడల్ స్కూలే కాదు.. మండల కేంద్రానికి డంపింగ్ యార్డు, చివరికి శ్మశాన వాటికకు కూడా స్థలం లేని దౌర్భాగ్య పరిస్థితిని జామి ప్రజలు ఎదుర్కొంటున్నారు. దీనంతటికీ రాజకీయ నాయకుల చిత్త శుద్ధి లోపమే అని కొందరంటే, లేదు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

జామి మేజరు పంచాయతీలో 16 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఏడాదికి సుమారుగా రూ.65 లక్షల వార్షిక బడ్జెట్ అంచనా కలిగిన మేజరు పంచాయతీ ఇది. ఇంత ఆదాయం ఉన్న గ్రామంలో అరకొర కాంట్రాక్ట్ పనులు తప్ప, గ్రామ మౌలిక సదుపాయాల కల్పన నామమాత్రమే. అభివృద్ధి పనుల విషయానికి వస్తే, స్థలం లేదన్న వంకతోవాటిని దూరం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కస్తూరిభా స్కూల్‌ను మండల కేంద్రంలో స్థలం లేదని కుమారం పంపేసిన విషయం తెలిసిందే. నేడు కెజిబివి వసతి గృహం, మోడల్ స్కూల్ నిర్మాణానికి అదే పరిస్థితి. ఈ తరుణంలోనే జామి అభివృద్ధికి నోచుకోవడం లేదన్న వాదన వినిపిస్తుంది.


నదిలో వేసిన వ్యర్థాలు

క్వారీల చుట్టూ వందల ఎకరాలు

జామి మాధవరాయమెట్ట గ్రామం చుట్టు వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు క్వారీ కాంట్రాక్టుల చేతిలో ఉన్నాయి. క్వారీలు, క్రషర్ల పేరిట భూములను కాజేసినట్లు ఆరోపనులు ఉన్నాయి. గతంలో క్వారీలపై వేలాది మంది కార్మికులకు ఉపాధి లభించేది. కానీ నేడు ఉపాధి లేక క్వారీ కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస పోతున్న పరిస్థితి. పైగా ఎంఆర్ కాలనీ చుట్టూ దుమ్మూ, ధూలీ వ్యధజల్లే క్రషర్లను, అక్రమ క్వారీలను నిలుపుదల చేయాలని పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ క్రసర్లు, క్వారీలు నిలుపుదల చేసి, వాటి చెరలో ఉన్న ప్రభుత్వ భూముల్లో మోడల్ స్కూల్ నిర్మాణం చెపట్టేలా అధికారులు, నాయకులు ఆలోచన చేయాలన్న డిమాండ్ వినిపిస్తుంది.


బక్కచిక్కిపోయిన శ్మశాన వాటిక

శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్‌కు స్థలం లేదు

జామి గ్రామానికి శ్మశాన వాటిక జాతీయ రహదారి నిర్మాణంతో కొంత భాగం మాత్రమే మిగులుంది. ఇది ఊరు జనం అవసరాలకు సరిపోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి సంగతి అంటుంచితే, చితి కాల్చడానికే స్థలం లేని పరిస్థితి. గ్రామంలో రోజుకు సుమారుగా 4 యూనిట్లు చెత్త సేకరిస్తారు. కానీ ఆ చెత్తను వేసేందుకు యార్డు లేదు. దీంతో ప్రతి రోజూ సేకరించిన చెత్తను గోస్తనీ నదీ గర్భంలో వేస్తున్న పరిస్థితి. వీటన్నింటికీ స్థలాన్ని బూచిగా చూపిస్తున్న అధికారులు, క్వారీలు, క్రషర్లు చుట్టూ ఉన్న ఆక్రమణల జోలికి వెళ్లకుండా, అభివృద్ధిని కుంటి పరుస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పై ఆలోచన చేస్తున్నాం

జామి గ్రామంలో శ్మశానం, డంపింగ్ యార్డుల విషయంపై పాలకవర్గం ఆలోచన చేస్తుంది. యల్లారమ్మ జాతర అనంతరం డంపింగ్ యార్డు పై చర్యలు తీసుకుంటాం.

- ఎన్. రమణారావు, ఇఒ, జామి


పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఘనంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలం కేంద్రంలో స్థానిక వసంత విహార్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూత్ లీడర్లు లెంక అర్జున్, గవరవరపు సంతోష్ కుమార్, తెలుగు యువత చిన్న, మహేష్, నాగరాజు, జి.రవి నిర్వహించిన పోటీలకు ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్, రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ డిఫెన్స్ ఎంప్లాయ్ సప్పవరపు జితేంద్రకుమార్, కొత్తవలస ఒకటొ వార్డు సభ్యులు కర్రీ సూర్య నూకరాజు పాల్గొని పోటీలను ప్రారంభించారు. వారం రోజులు పాటు జరగనున్న ఈ పోటీలకు మండలంలోని 25 జట్లు పాల్గొని తలబడనున్నాయి. ఈ కార్యక్రమంలో వసంత విహార యూత్ సభ్యులు ఉపేంద్ర, సాయి, పండు, తదితరలు పాల్గొన్నారు.

వాహనాలకు సరైన పత్రాలు ఉండాల్సిందే

ప్రజాశక్తి- డెంకాడ


బండిని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వాహనదారులు తమ వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ఏ.సన్యాసి నాయుడు తెలిపారు. మండలంలోని విజయనగరం, నాతవలస వెళ్లే వెళ్లే రోడ్డులో ఆయన ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 17 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు. మోటార్ సైకిల్, ఆటో, ఫోర్ వీలర్, బస్సు, లారీ ఇలా ప్రతి వాహనానికి లైసెన్స్, ఇన్సూరెన్స్, సిబుక్, రోడ్ టాక్స్ తదితర పత్రాలన్నీ ఉండాలన్నారు. మోటార్ సైకిల్ నడుపుతున్న ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించాలని కోరారు. వాహనాల ద్వారా మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతి వ్యక్తి రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి- బొండపల్లి

బొండపల్లి, గెద్దపేట మధ్యలో వెలసిన మల్లిఖార్జున మాధవ లింగేశ్వరస్వామి దేవాలయం (శివాలయం) ఆవరణంలో నవగ్రహ విగ్రహాలు ప్రతిష్ట ఆదివారం అంత్యంత వైభవంగా జరిగింది. ఈ మేరకు వేదపండితుల మంత్రోచరణ, మంగళ వాయిద్యాల నడుమ ఈ నవగ్రహ విగ్రహాలు ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. వినాయక, శ్రీ భ్రమరాంబిక, శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామీ విగ్రహాలు ప్రతిష్ట కూడా జరిగింది. ఆలయ నిర్వాహుకులు భక్తుల సౌకార్యార్థం పలు ఏర్పాట్లు చేశారు.

19 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని లింగాలవలసలో 10 మద్యం సీసాలతో సారిక అప్పలనాయుడును, మధుపాడలో ఒక మహిళ వద్ద నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సిఐ జె. జనార్ధనారావు తెలిపారు. ఇద్దరు వద్ద నుంచి మొత్తం 19 సీసాలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎన్. కొండలరావు, హెచ్‌సిలు ఎమ్‌డిజె భాషా, లోకాభిరామ్, కానిస్టేబుళ్లు అప్పారావు,గంగాధరుడు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులను అందిస్తున్న కృష్ణదాసు

ఒడిశా కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి


స్థానిక రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న ఒడిషా వలస కార్మికులకు ఆదివారం వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. వలస కార్మికులకు అండగా ఉండేందుకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు.

రాత్రి చదువుల పరిశీలన

ప్రజాశక్తి - నెల్లిమర్ల


విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మండలంలోని తంగుడుబిల్లిలో రాత్రిపూట పదవ తరగతి విద్యార్థుల చదువులను ఆ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించారు. ఆదివారం రాత్రి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటికి వెళ్లి వారు చదువుతున్నారో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు శివకు బంగారయ్య, హిందీ ఉపాధ్యాయులు డి.వి.కె.ప్రసాద్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ పది రోజులు చదువు కీలకమన్నారు. ప్రణాళికా ప్రకారం చదివితే శతశాతం సాదిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఇంటి వద్ద చదువుతునారో లేదో పరిశీలించాలని, టివి, సెల్‌ఫోన్‌లు పిల్లలకు దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్

మాదకద్రవ్యాలతో నష్టాలపై అవగాహన

ప్రజాశక్తి - వంగర

మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివ్వాంలో ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పన్ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

టాటా మేజిక్, ఆటో, ప్యాసింజర్ వ్యాన్లపై పర్యావరణ పన్ను (గ్రీన్ ట్యాక్స్)ను వెంటనే రద్దు చేయాలని ఎపి ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ జి.వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ ట్యాక్స్, లేబర్ ట్యాక్స్‌ను రద్దు చేయాలన్నారు. భారీగా పెంచిన థర్డ్‌పార్టీ బీమాను రద్దు చేయాలని కోరారు. సిఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.రంగరాజ, ఈశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

విజయగౌరి గెలుపునకు యుటిఎఫ్ ప్రచారం

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరీ గెలుపునకు నాలుగు మండలాల యుటిఎఫ్ నాయకులు విస్తృతంగా గత పది రోజుల నుండి ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రతిరోజు పాఠశాలలను విడిచిపెట్టిన సాయంత్రం పూట యుటిఎఫ్ నాయకులు ఓట్లు ఉన్న ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విజయగౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాటం చేస్తున్న విజయగౌరిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యుటిఎఫ్ నాయకులు ఓటర్లకు వివరిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయ ఓటర్లను యుటిఎఫ్ నాయకులు కలిసి విజయగౌరిని గెలిపించాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 316 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. ఈనెల 27వ తేదీన జరుగునున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రచారంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి రాము, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ సత్యశ్రీనివాస్, జిల్లా గౌరవాధ్యక్షుడు మీసాల అప్పల నాయుడు, జిల్లా కార్యదర్శి ముదునూరు రఘునాథ రాజు, నాలుగు మండలాల యుటిఎఫ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


చీపురుపల్లిలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విజయగౌరిని గెలిపించండి

వేపాడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం వేపాడ, వల్లంపూడి, ఆకుల సీతంపేట, అరిగిపాలెం, బొద్దాం గ్రామాల్లో ఇంటింట ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఐ.జగదీశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ఆర్.రామసత్యం, సిఐటియు నాయకులు చల్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి-విజయనగరంకోట



వార్త దిన పత్రిక విలేకరి శనపతి శ్రీనివాసరావు (42) ఆదివారం మృతి చెందారు. విజయనగరం మండలంలోని ధర్మపురికి చెందిన శ్రీనివాసరావుకు ఇటీవల నగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో మెదడు శస్త్రచికిత్స జరిగింది. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారు జామున మృతిచెందారు. 20 ఏళ్లుగా ఆయన జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు మృతిపై జర్నలిస్టు సంఘాల నాయకులు విచారం వ్యక్తంచేశారు. ధర్మపురిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగుల్లో అనిశ్చితిని ప్రభుత్వం తొలగించాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఏర్పడిన అనిచ్చితిని కూటమి ప్రభుత్వం తొలగించాలని కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి మహేంద్రబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్ రద్దుచేస్తామని పత్రికల్లో వచ్చిన కథనాలపై అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు సెర్ప్, మెప్మా సొసైటీ ఉద్యోగుల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.శ్రీనుతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పని చేస్తోన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


ఎడ్ల పరుగు పందెంలో పాల్గొన్న బండి

రసవత్తరంగా ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నల్లబెల్లి గ్రామంలో భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పందేలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 11 గుర్రాలు పాల్గొని తలబడ్డాయి. వీటిలో మొదటి విజేతకు రూ.10వేలు, రెండవ విజేతకు రూ. 8వేలు, మూడో విజేతకు రూ.6వేలు నగదు బహుమతులను సర్పంచ్, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ చేతులు మీదుగా అందజేశారు.


గుర్రపు పందెంలో పాల్గొన్న యువకుడు

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన

అనంతరం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పోటీల్లో 12 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. మొదటి స్థానం సాధించిన వావిలపాడు మరిడిమాంబ ఎడ్ల బండికి రూ.12వేలు, రెండో స్థానంలో నిలిచిన దేవరపల్లి శ్రీవీరాంజనేయ బండికి రూ.10వేలు, మూడో స్థానంలో నిలిచిన గండి వెంకటరావుపేట బండికి రూ.8వేలు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ పరిశీలన

ప్రజాశక్తి- బొబ్బిలి

రామభద్రపురం మండలంలోని కొట్టక్కి రెవెన్యూ పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న సుమారు రూ.10 కోట్లు విలువ చేసే చెరువు ఆక్రమణలను సిపిఎం నాయకులు పి. శంకరరావు ఆదివారం పరిశీలించారు. సర్వే నెంబర్ 431-5 సుమారు ఎకరా చెరువు ఆక్రమించుకుంటున్నారని తెలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే చెరువుపై ఆక్రమణకు గురవుతుందని తహశీల్దార్, ఆర్‌డిఒలకు కొంతమంది ఫిర్యాదు చేయగా రామభద్రపుంర తహశీల్దార్ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని ఒక నోటీసు జారీ చేశారని సంవత్సరం తిరక్క ముందే రికార్డులు తారుమారు చేసేసి కబ్జాకు పాల్పడుతున్నారని చెప్పారు. చెరువులను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడి రికార్డులు మార్చి చెరువులను మాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎవరెవరున్నారో పేరుతో సహా రాబోయే రోజుల్లో బయటపెట్టి వాళ్ళ పైన కేసులు పెడతామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని సమగ్రంగా దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలనలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ గోపాల్, బలస శ్రీను పాల్గొన్నారు.


కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

30 మంది రక్తదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేట సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ రక్తదానంపై సేవలు మొదలుపెట్టి 17 సంవత్సరాలు పూర్తి చేసుకుని 18 ఏట అడుగుపెడుతున్న (65వ సారీ రక్తదానం) సందర్భంగా విజయనగరం మహారాజ బ్లడ్ బ్యాంకులో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రక్త శిబిరాన్ని సందర్శించి 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు బోడ్డేపల్లి రామకృష్ణారావు మాట్లాడుతూ సాధన యువజన సంఘం సేవలు ప్రారంభించి నేటికి 18వ సంవత్సరంలోకి అడుగు పెట్టడం అభినందనీయమన్నారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, స్ఫూర్తి సాయి కుమార్, భగత్ సింగ్ హెల్పింగ్ హాండ్స్ వై.సురేష్, కొత్తల శంకర్రావు, గర్భపు శ్రీను, రాధిక సురేష్, అవనాపు అప్పలరాజు, కనకల బ్రమ్మేశ్, బండారు సందీప్ పాల్గొన్నారు.


దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మెమో 57ను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు వర్తింప చేసి వారికి పాత పింఛనను తక్షణమే అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.పద్మావతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2003 డిసెంబర్ 31వ తేదీకి ముందు ఉద్యోగ ప్రకటనలు వెలువడి సెలెక్ట్ కాబడి, ప్రభుత్వ అలసత్వం వల్ల వివిధ కేటగిరీల ఉద్యోగులకు 2003 డిఎస్‌సి ఉపాధ్యాయ నియామకాలు 2004 లో నిర్వహించారని అలా నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మెమో 57ను విడుదల చేసిందన్నారు. ఆ మెమోని రాష్ట్రాలు కూడా అమలు చేసి పాత పింఛను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట అకడమిక్ కన్వీనర్ జెసి రాజు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. మధ్యంతర భృతిని చెల్లించాలని, 12వ వేతన సంఘాన్నీ నియమించాలని, సంవత్సరాలాగా ఉన్న ఆర్థిక బాకాయిలను, నెలల తరబడి ఉన్న పిఎఫ్ బాకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జోగి నాయుడు, సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్, సింహాచలం, ఎల్లయ్య, కె శ్రీను, రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెసి రాజు

న్యాయవాదులకు ఇళ్ల స్థలాలివ్వండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

న్యాయవాదుల సంఘం సభ్యులందరికీ స్థానికంగా ఇళ్లు లేవని, తమకు స్థానికంగా ఇళ్లు నిర్మించుకొనేందుకు ఒకేచోట అందరికీ స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారికి ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతానని, సాధ్యమైనంత త్వరలో ఇండ్ల స్థలాలు కేటాయింపజేసేందుకు కృషి చేస్తానని న్యాయవాదులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు జి.సూరి దేముడు, బి.సత్యన్నారాయణ, కోసాధికారి బి.త్రిమూర్తులు, యన్‌టివి దాసు, ఆర్.సత్యన్నారాయణ, బి.రామకృష్ణ, టి.వి.రమణ మూర్తి, జి.చిట్టి బాబు, బి.రామారావు, యమ్.దొరబాబు, కె.రాము, ఎల్.సత్యన్నారాయణ, టిడిపి మండల కార్యదర్శి జి.యస్.దేముడు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే లలితకుమారిని కలిసిన న్యాయవాదులు